క్లుప్తంగా

ఎమ్మెల్సీ పరామర్శ


అబ్దుల్ మస్తాన్‌ను పరామర్శిస్తున్న ఎమ్మెల్సీ

నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట): 42వ డివిజన్ కుద్దూస్ నగర్‌లో ఇటీవల అనారోగ్యానికి గురై కోలుకుంటున్న వైఎస్సార్‌సీపీ మైనారిటీ విభాగం నగరాధ్యక్షుడు అబ్దుల్ మస్తాన్‌ను ఆయన నివాసంలో పార్టీ జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్, ఎమ్మెల్సీ పర్వతరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి ఆదివారం పరామర్శించారు. ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. కార్పొరేటర్ కరిముల్లా, పార్టీ మైనారిటీ విభాగం జిల్లా అధ్యక్షుడు సిద్దిఖ్, జిల్లా ఉపాధ్యక్షుడు మజ్జిగ జయకృష్ణారెడ్డి, నగర యువజన విభాగం అధ్యక్షుడు యస్దాని, నాయకులు జియా, జమీర్ పాల్గొన్నారు.

• **నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట):** 48వ డివిజన్ మీరా మొహిద్దీన్ దర్గా ప్రాంతంలో పార్టీ మైనారిటీ నాయకుడు హాజీవలీని పార్టీ జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్, ఎమ్మెల్సీ పర్వతరెడ్డి చంద్రశేఖర్ రెడ్డి ఆదివారం పరామర్శించారు. కార్యక్రమంలో పార్టీ స్టేట్ జాయింట్ సెక్రటరీ ప్రభాకర్, స్థానిక నేతలు వాణి, సురేష్, రఫీ, అస్లామ్ పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం



నెల్లూరు(బృందావనం): పురమందిరం ప్రాంగణంలోని ఏసీ హాల్లో పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం ఆదివారం జరిగింది. వీఆర్ కళాశాలలో 1976–1979 మధ్య బీఎస్సీ చేసిన వారు తమ కుటుంబసభ్యులతో 'గుర్తుకొస్తున్నాయి 2025' ఆత్మీయ సమ్మేళనాన్ని జరుపుకున్నారు. దేశంలోని వివిధ ప్రాంతాల్లో స్థిరపడిన వారందరూ కుటుంబ సభ్యులతో హాజరయ్యారు. ఈ సందర్భంగా కార్యక్రమ నిర్వాహకులు మాట్లాడుతూ దాదాపు 50 ఏళ్ల క్రితం బీఎస్సీ చదువుకున్న తాము 20 ఏళ్ల నుంచి ఏటా ఆత్మీయ సమ్మేళనాన్ని నిర్వహిస్తూ తమ మైత్రి బంధాన్ని కొనసాగిస్తున్నామన్నారు. గతేడాది ఊటీలో నిర్వహించామని, ఈ ఏడాది నెల్లూరులో చేపట్టామన్నారు. నిర్వాహకులు జీవీ నాగరాజారావు, కె.రవీంద్రరెడ్డి, ఆనంద్, ఎస్.సత్యనారాయణ, డాక్టర్ పద్మప్రియ, డాక్టర్ సుధాకర్‌రెడ్డి, ప్రదీప్‌కుమార్ తదితరులు పర్యవేక్షించారు.

ఫ్లైఓవర్ నిర్మాణానికి పోరాటం చేస్తాం

నెల్లూరు(వీఆర్సీసెంటర్): చింతారెడ్డిపాళెం జాతీయ రహదారి కూడలిలో నిత్యం రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నాయని, ఇక్కడ ఫ్లైఓవర్ వంతెన నిర్మాణానికి దశలవారీగా పోరాటాలు చేస్తామని బ్రిడ్జి సాధన కమిటీ కన్వీనర్ శ్రీనివాసులు అన్నారు. ఈ మేరకు చింతారెడ్డిపాళెం కూడలిలో ఆదివారం నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ ప్రాంతంలో ఫ్లైఓవర్ బ్రిడ్జి నిర్మించి రోడ్డు ప్రమాదాలను నివారించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో రమణయ్య, శంకరయ్య, భాస్కర్‌రెడ్డి, వెంకటేశ్వర్లు నాయుడు, సంపూర్ణ, ప్రసాద్, వేణు, నారాయణరెడ్డి, అబ్దుల్ ఖాదర్ పాల్గొన్నారు.

'ఆలూరు'కు పురస్కారం



నెల్లూరు(బృందావనం): గుంటూరులోని బ్రాహ్మణ సేవా సమితి భవన్‌లో రాష్ట్రస్థాయి బ్రాహ్మణ ఉపాధ్యాయ అవార్డుల ప్రధానోత్సవ కార్యక్రమం ఆదివారం ఘనంగా నిర్వహించారు. నెల్లూరుకు చెందిన కవి, పండితుడు, విశ్రాంత ఉపాధ్యాయుడు ఆలూరు శిరోమణిశర్మ రాష్ట్రస్థాయి ఉత్తమ ఉపాధ్యాయ పురస్కారాన్ని అందుకొన్నారు.

అమ్మణ్ణికి వెండికలశం బహూకరణ



నెల్లూరు(బృందావనం): నగరంలోని ఇరుకళల పరమేశ్వరి అమ్మవారికి విష్ణువర్ధన్ ఆదివారం వెండి పూర్ణకలశాన్ని బహూకరించారు. సుమారు రూ.72,750 విలువైన 505.980 గ్రాముల వెండి కలశాన్ని అందించినట్లు దేవస్థానం ఈఓ వి.గిరికృష్ణ తెలిపారు.

టెక్నికల్ స్టాఫ్ సమస్యలను పరిష్కరించాలి

నెల్లూరు (టౌన్): పాలిటెక్నిక్ టెక్నికల్ స్టాఫ్ సమస్యలను పరిష్కరించాలని నెల్లూరుకు చెందిన ఏపీ పాలిటెక్నిక్ టెక్నికల్ స్టాఫ్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు బాషా, ఉపాధ్యక్షుడు శ్రీహరి కోరారు. ఈ మేరకు ఆదివారం తిరుపతిలో ఎమ్మెల్యే ఆరని శ్రీనివాసులును కలిసి వినతిపత్రం సమర్పించారు. దీనిపై ఎమ్మెల్యే సానుకూలంగా స్పందించి తనవంతు కృషి చేస్తానని హామీ ఇచ్చారు.

ప్రభుత్వ వైఫల్యాలను ఎండగట్టాలి


మాట్లాడుతున్న ఆనం విజయ్‌కుమార్‌రెడ్డి

• ముగిసిన ఆత్మీయ సమావేశాలు

నెల్లూరు సిటీ: కూటమి ప్రభుత్వ వైఫల్యాలను నాయకులు, కార్యకర్తలు క్షేత్రస్థాయిలో ఎండగట్టాలని వైఎస్సార్‌సీపీ నెల్లూరు రూరల్ సమన్వయకర్త ఆనం విజయకుమార్‌రెడ్డి అన్నారు. గత మూడు నెలల నుంచి వైఎస్సార్‌సీపీ రూరల్ నియోజకవర్గ నాయకులు, కార్యకర్తలతో నిర్వహిస్తున్న ఆత్మీయ సమావేశాలు ఆదివారంతో ముగిశాయి. ఈ క్రమంలో చింతారెడ్డిపాళెంలోని విజయకుమార్‌రెడ్డి నివాసంలో ఆదివారం 2, 12 డివిజన్ల నాయకులు, కార్యకర్తలతో ఆత్మీయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పార్టీ కోసం, పార్టీ బలోపేతం కోసం ప్రతిఒక్కరూ కచ్చితంగా కృషి చేయాలని సూచించారు. భవిష్యత్తులో రూరల్ నియోజకవర్గంలో పార్టీకి పూర్వ వైభవం తీసుకొచ్చేలా పని చేయాలని వివరించారు. పార్టీలో ప్రతిఒక్కరికీ సముచిత స్థానం ఉంటుందన్నారు. కార్యక్రమంలో 2, 26వ డివిజన్ల ఇన్‌చార్జిలు, నాయకులతో పాటు, పార్టీ రాష్ట్ర కమిటీ సభ్యులు, జిల్లాస్థాయి సభ్యులు, జిల్లా అనుబంధ సంఘాల సభ్యులు, నాయకులు పాల్గొన్నారు.

సవాల్‌ను స్వీకరించే ధైర్యం లేదా?

• సోమిరెడ్డిపై వైఎస్సార్‌సీపీ నేతల ధ్వజం



మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట): గ్రావెల్ అక్రమాలపై సర్వేపల్లి ఎమ్మెల్యే సోమిరెడ్డికి మాజీ మంత్రి, వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు కాకాణి గోవర్ధన్‌రెడ్డి సవాల్ విసిరారని, దానిని స్వీకరించే ధైర్యం ఆయనకు లేదా అని పార్టీ రాష్ట్రస్థాయి నాయకులు ప్రశ్నించారు. నగరంలోని జిల్లా పార్టీ కార్యాలయంలో ఆదివారం వారు విలేకరుల సమావేశం నిర్వహించారు. పార్టీ రాష్ట్ర సోషల్ మీడియా జాయింట్ సెక్రటరీ ఆవుల తులసిరామ్ యాదవ్ మాట్లాడుతూ గ్రావెల్ తవ్వకాల అనుమతులు చూపించేందుకు సోమిరెడ్డికి ఎందుకు భయమని నిలదీశారు. తమ నాయకుడు కాకాణి గోవర్ధన్‌రెడ్డిపై పెట్టిన ఏ కేసు నిలబడదని, న్యాయం కచ్చితంగా గెలుస్తుందన్నారు. సర్వేపల్లి అవినీతిపై సీబీఐ విచారణ వేయించాలని కాకాణి అడిగితే అధికారంలో ఉన్న సోమిరెడ్డికి భయమెందుకని అన్నారు. సోమిరెడ్డి తన చోటా నేతలతో కాకాణిపై అనుచితంగా మాట్లాడిస్తున్నారని, సర్వేపల్లి అభివృద్ధి ఎవరి హయాంలో జరిగిందో ప్రజలే చెబుతారని తెలిపారు. సొంత పార్టీ నాయకులే సోమిరెడ్డి చేస్తున్న అక్రమాలను సహించే పరిస్థితి లేదన్నారు. కాకాణి విసిరిన సవాల్‌ను స్వీకరించి గ్రావెల్ తవ్వకాలకు సంబంధించిన అనుమతులను చూపించాలని, దీనిపై సోమిరెడ్డి టైమ్, డేట్ చెబితే తమ నాయకులతో పాటు తాము కూడా వెళ్లి పరిశీలిస్తామన్నారు.

వారికి మాట్లాడే స్థాయి లేదు

పొదలకూరులోని సోమిరెడ్డి చెంచాలకు తమ నాయకుడు కాకాణి గురించి మాట్లాడే అర్హత, స్థాయి లేదని మైనార్టీ నాయకుడు అంజాద్‌బాషా అన్నారు. అవినీతి సామ్రాట్ సోమిరెడ్డిపై తమ నాయకుడు కాకాణి సవాల్ విసిరితే చెంచాలతో ఎందుకు మొరిగిస్తున్నావని నిలదీశారు. రాజకీయ కక్షతో గోవర్ధన్‌రెడ్డిపై పెట్టిన ఒక్క కేసునైనా నిరూపించగలరా..? అని ప్రశ్నించారు. సోమిరెడ్డి, ఆయన కేడర్ కరోనా సమయంలో ఎక్కడా కనిపించలేదని, అయితే కాకాణి తన ప్రాణాన్ని సైతం లెక్కచేయకుండా ప్రజలను ఆదుకున్నట్లు గుర్తుచేశారు. సమావేశంలో పార్టీ జిల్లా ఎస్సీ సెల్ జనరల్ సెక్రటరీ జనార్దన్, బీసీ సెల్ జిల్లా జాయింట్ సెక్రటరీ కిరణ్, రాష్ట్ర బూత్ కమిటీల విభాగం సంయుక్త కార్యదర్శి నరేష్‌నాయుడు, పార్టీ నేత ప్రభాకర్ యాదవ్ పాల్గొన్నారు.

సురవరాన్ని ఆదర్శంగా తీసుకోవాలి



మాట్లాడుతున్న ఈశ్వరయ్య

నెల్లూరు(వీఆర్సీసెంటర్): ప్రతి కమ్యూనిస్టు సురవరం సుధాకర్‌రెడ్డిని ఆదర్శంగా తీసుకోవాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు గుజ్జుల ఈశ్వరయ్య, జిల్లా కార్యదర్శి అరిగె నాగేంద్రసాయి అన్నారు. కామ్రేడ్ సురవరం సుధాకర్‌రెడ్డి సంస్మరణ సభ సంతపేటలోని సీపీఐ జిల్లా కార్యాలయంలో ఆదివారం నిర్వహించారు. తొలుత సురవరం చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సురవరం సుధాకర్‌రెడ్డి గత నెల ఆగస్టు 22న హైదరాబాద్‌లో అనారోగ్యంతో మృతిచెందడం పార్టీకి తీరని లోటు అని అన్నారు. ఆయన గ్రామాల్లో ఉపాధి హామీ పథకం అమలు కోసం పార్లమెంట్‌లో యూపీఏ–1 ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకురావడంతో రాజ్యాంగాన్ని మార్చి అమలు చేసినట్లు గుర్తుచేశారు. అదేవిధంగా 2జీ కుంభకోణాన్ని వెలుగులోకి తీసుకొచ్చింది సురవరం సుధాకర్‌రెడ్డి అని తెలిపారు. కాగా రాష్ట్ర టిడ్కో చైర్మన్ వేములపాటి అజయ్‌కుమార్ హాజరు కాగా స్థానిక మహిళలు తమకు టిడ్కో ఇళ్లు కావాలని వినతి పత్రాలు అందజేశారు. దీనిపై ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ నిబంధనల ప్రకారం తెల్లరేషన్ కార్డు కలిగి, స్థానికులుగా ఉండాలని, కుటుంబ ఆదాయం సంవత్సరానికి రూ.3 లక్షలు మించకుండా ప్రభుత్వం నుంచి ఎలాంటి స్థలం, ఇళ్లు పొందని వారు అర్హులన్నారు. సీపీఎం జిల్లా కార్యదర్శి మూలం రమేష్, నాయకులు పములు దశరథరామయ్య, దామా అంకయ్య, వినోదిని పాల్గొన్నారు.

వాకర్స్‌కు వైద్యశిబిరం


ఏసీ సుబ్బారెడ్డి స్టేడియంలో..


మహిళలకు వైద్యపరీక్షలు

నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట): నగరంలోని ఏసీ సుబ్బారెడ్డి స్టేడియంలో వివేకానంద వాకర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆదివారం ఉచిత వైద్యశిబిరాన్ని నిర్వహించారు. డాక్టర్లు అంకిరెడ్డి, కృష్ణమూర్తి, శ్రీధర్‌లు వాకర్స్‌కు బీపీ, షుగర్ వంటి పరీక్షలను చేశారు. అసోసియేషన్ అధ్యక్షుడు చింతల అమరేంద్రరెడ్డి, కార్యదర్శి పొన్నం రవీంద్ర, నేతలు డీవీ సుబ్బరాజు, స్వర్ణ రమేష్, గోపాల్‌రెడ్డి, సుబ్బారెడ్డి, కేఎంకే రెడ్డి, చంద్రమౌళి, ఖలీల్‌బేగ్, లీలాద్రి తదితరులు పాల్గొన్నారు.

• **నెల్లూరు(బృందావనం):** పాతమున్సిపల్ కార్యాలయం దగ్గర పుట్టా ఎస్టేట్‌లో ఫ్యూర్‌స్మైల్ సేవా సంస్థ ఆధ్వర్యంలో ఆదివారం ఉచిత వైద్యశిబిరం నిర్వహించారు. లయన్స్ క్లబ్ ఆఫ్ సంఘమిత్ర, పుట్టా ఎస్టేట్ మహిళా వాకర్స్ సౌజన్యంతో సుశీల నేత్రాలయ హాస్పిటల్ సహకారంతో బీపీ, షుగర్ తదితర పరీక్షలు ఉచితంగా చేశారు. ఈ సందర్భంగా సంస్థ అధ్యక్షురాలు పర్వీన్ మాట్లాడుతూ స్థానిక ప్రజల ఆరోగ్య సంరక్షణ కోసం ఇలాంటి కార్యక్రమం చేపట్టామని వివరించారు. లయన్స్ క్లబ్ ఆఫ్ సంఘమిత్ర, పుట్టా ఎస్టేట్ మహిళా వాకర్స్ అధ్యక్ష, కార్యదర్శులు, కోశాధికారులు సంధ్యా, సులక్షణ, హేమామాలిని, పర్వీన్, నళిని, లలిత, నేత్రాలయ టెక్నీషియన్లు విజయలక్ష్మి, జునైనా పాల్గొన్నారు.

బీమా పథకాలతో అనేక ప్రయోజనాలు

నెల్లూరు సిటీ: ప్రధాన మంత్రి జీవనజ్యోతి బీమా యోజన, సురక్ష బీమా యోజన, అటల్ పెన్షన్ యోజన వంటి పథకాలతో అనేక ప్రయోజనాలు ఉన్నాయని, వాటిని వినియోగించుకోవాలని ఎస్‌బీఐ అమరావతి సర్కిల్ జనరల్ మేనేజర్ అమరేంద్రకుమార్‌సుమన్ తెలిపారు. వేదాయపాళెంలోని లక్ష్మీవెంకటరమణ కల్యాణ మండపంలో ఆదివారం జనసురక్ష కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బీమా పథకాలు కలిగి ఉండడం ద్వారా ఏదైనా ప్రమాదం జరిగితే రూ.2 లక్షల నగదు కుటుంబాలకు వస్తుందన్నారు. ఖాతాదారులు జనధన్ అకౌంట్‌కు సంబంధించి పదేళ్లు పూర్తయిన వారు తప్పనిసరిగా కేవైసీ చేయించుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఎస్‌బీఐ వేదాయపాళెం చీఫ్ మేనేజర్ హరికృష్ణరావు, టౌన్‌చీఫ్ మేనేజర్ శ్రీరాము, ఏజీఎం లక్ష్మణ్, పొదుపు మహిళలు, ఖాతాదారులు పాల్గొన్నారు.

18న చలో విజయవాడ

నెల్లూరు(వీఆర్సీసెంటర్): ఆటో డ్రైవర్లను కూటమి ప్రభుత్వం మోసం చేసిందని జిల్లా ఆటో కార్మిక సంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు సురేష్, రాజా ఆరోపించారు. నగరంలోని సీఐటీయూ కార్యాలయంలో ఆదివారం వారు విలేకరుల సమావేశం నిర్వహించారు. ఎన్నికల సమయంలో చంద్రబాబు ఆటో డ్రైవర్లకు ఏడాదికి రూ.15 వేలు ఇస్తానని మోసం చేశారని, దీనిపై ఈనెల 18న ఆటో కార్మిక సంఘాల ఆధ్వర్యంలో చేపట్టే 'చలో విజయవాడ' కార్యక్రమానికి పెద్ద సంఖ్యలో ఆటో డ్రైవర్లు, కార్మికులు హాజరు కావాలని కోరారు.

ఎమ్మెల్సీ పర్వతరెడ్డితో సింగంశెట్టి అశోక్ తదితరులు



వైఎస్సార్‌సీపీ బలోపేతమే లక్ష్యం

నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట): వైఎస్సార్‌సీపీ బలోపేతమే లక్ష్యంగా రెబల్ స్టార్ ప్రభాస్ అభిమానులు వందల కొద్ది ఎమ్మెల్సీ చంద్రశేఖర్‌రెడ్డిని కలిశారు. పార్టీ బూత్ కమిటీ నగరాధ్యక్షుడిగా ప్రభాస్ ఫ్యాన్స్ జిల్లా అధ్యక్షుడు సింగంశెట్టి అశోక్ ఎంపికైన క్రమంలో ప్రభాస్ ఫ్యాన్స్ భారీ సంఖ్యలో నగర పార్టీ కార్యాలయంలో సిటీ సమన్వయకర్త, ఎమ్మెల్సీ పర్వతరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డిని ఆదివారం కలిసి కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా ఎమెల్సీ పర్వతరెడ్డి మాట్లాడుతూ క్రమశిక్షణకు మారు పేరు అయిన ప్రభాస్ అభిమానులు వందలాది మంది తమ పార్టీ నాయకుడు అశోక్‌కు మద్దతుగా తరలిరావడం సంతోషంగా ఉందన్నారు. తొలుత ప్రభాస్ అభిమానులు భారీ ర్యాలీ నిర్వహించారు. అనంతరం అశోక్‌ను ఎమ్మెల్సీ పర్వతరెడ్డి సన్మానించారు. కార్యక్రమంలో పార్టీ స్టేట్ సెక్రటరీ పేర్నెటి కోటేశ్వరరెడ్డి, జాయింట్ సెక్రటరీ కొణిదల సుధీర్, జిల్లా యువజన విభాగం అధ్యక్షుడు, కార్పొరేటర్ ఊటుకూరు నాగార్జున, పార్టీ మేధావుల ఫోరమ్ నగరాధ్యక్షుడు సుమధర్, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

కాకాణి ప్రశ్నలకు సమాధానం చెప్పాలి

• వైఎస్సార్‌సీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి మల్లి నిర్మల



నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట) : మాజీ మంత్రి, వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు కాకాణి గోవర్ధన్ రెడ్డి అడిగిన ప్రశ్నలకు సోమిరెడ్డి సమాధానం చెప్పాలంటూ పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి మల్లి నిర్మల ప్రశ్నించారు. జిల్లా పార్టీ కార్యాలయంలో ఆదివారం ఆమె మీడియా సమావేశం నిర్వహించారు. కాకాణి ప్రశ్నలకు సమాధానాలు చెప్పలేక సోమిరెడ్డి అవహేళనగా మాట్లాడుతున్నాడన్నారు. కూటమి ప్రభుత్వంపై జిల్లాలో కాకాణి ఆధ్వర్యంలో ఏ పోరాటం చేసినా రైతులు, మహిళలు, ప్రజల మద్దతు విపరీతంగా వస్తుండడంతో టీడీపీ నాయకులకు కంటిమీద కునుకు లేకుండాపోయిందన్నారు. కాకాణికి ప్రజల్లో వస్తున్న ఆదరణను జీర్ణించుకోలేక సోమిరెడ్డి తనకు తెలియని అరణ్యవాసం, అజ్ఞాతవాసమంటూ మాట్లాడుతున్నాడన్నారు. సోమిరెడ్డిపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదైతే కుటుంబాన్ని అడ్డుపెట్టుకొని, మహిళను ప్రాధేయపడిన విషయాన్ని మర్చిపోయారని, కాకాణిపై అక్రమ కేసులు పెడితే న్యాయస్థానాల్లో పోరాటం చేశారే తప్ప ఎవరినీ వేడుకోలేదన్నారు. సోమిరెడ్డికి సొంత పార్టీలోనే విలువలేదని, ఇక ప్రజల్లో ఉంటుందా అని అన్నారు. సోమిరెడ్డి, ఆయన కుమారుడు ఆయిల్ ట్యాంకర్ దొంగతో ఉన్న ప్రస్తుత ఫొటోలు మా దగ్గర కూడా ఉన్నాయన్నారు. మా నాయకుడు కాకాణి గోవర్ధన్‌రెడ్డి ఇలాంటి వారిని దూరంగా ఉంచితే, తన సంపాదన కోసం వారిని చేరదీసి పెంచి పోషిస్తున్న వ్యక్తి సోమిరెడ్డి అని అన్నారు. సోమిరెడ్డి కోసం పనిచేసిన వ్యక్తి దొంగతనం బయటపడితే మా నాయకుడు కాకాణిపై బురద పోయడానికి ప్రయత్నిస్తున్నాడన్నారు. గ్రావెల్ అక్రమాలపై సీబీఐ విచారణ వేయించమని సవాల్ విసిరితే, స్వీకరించే దమ్ము సోమిరెడ్డికి లేదన్నారు.

అక్టోబర్ 19న రంగడి కల్యాణోత్సవం

నెల్లూరు(బృందావనం): రంగనాయకులపేటలోని రంగనాథస్వామి కల్యాణ మండపంలో అక్టోబరు 19న రంగడి కల్యాణోత్సవం జరుగనుందని కేసీ దాస్ ట్రస్ట్ నిర్వాహకులు పి.శ్రీనివాసరావు, రాధాకృష్ణ, పాటూరి రవికిరణ్‌లు తెలిపారు. దీనికి సంబంధించి సర్వోదయ కళాశాలలో ఆదివారం సమన్వయ కమిటీ సమావేశం జరిగింది. ఉదయం 8 నుంచి 10 గంటల వరకు వేడుక జరుగనుందన్నారు.

• రంగనాయకులపేటలోని రంగనాథస్వామి దేవస్థానంలో నేడు రంగడి కల్యాణోత్సవం ఉంటుందని ఈఓ ఆళ్ల శ్రీనివాసరెడ్డి ఆదివారం తెలిపారు.

జీవీ అమృతవల్లికి డాక్టరేట్



డాక్టరేట్ అందుకుంటున్న అమృతవల్లి

నెల్లూరు(అర్బన్): స్థానిక హరనాథపురంలోని పోలీసు డిపార్ట్‌మెంట్‌కు చెందిన ఇంటెలిజెన్స్ రిటైర్డ్ సబ్ ఇన్‌స్పెక్టర్ జీవీ పుల్లారెడ్డి కుమార్తె అమృతవల్లి డాక్టరేట్ సాధించారు. వేల్స్ యూనివర్సిటీలో డెవలప్‌మెంట్ టు ప్లాంట్ బేస్డ్ ఎక్సిపిఎంట్స్ అండ్ ఇట్స్ అప్లికేషన్ టువర్డ్స్ ఓరల్ డ్రగ్ డెలివరీ సిస్టమ్ అభివృద్ధి, వాటి వినియోగం, నోటి ద్వారా మందులు అందించే విధానం గురించి పీహెచ్‌డీ చేశారు. దీంతో ఆ వర్సిటీ వైస్ చాన్సలర్ ఐకే గణేష్, గైడ్ ప్రొఫెసర్ విజయలక్ష్మి చేతుల మీదుగా ఆదివారం డాక్టరేట్ అందుకున్నారు.

విద్యార్థుల సమగ్రాభివృద్ధికి చర్యలు


మాట్లాడుతున్న జీటీఏ రాష్ట్ర అధ్యక్షుడు తిరుపాలు

నెల్లూరు(పొగతోట): ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థుల సమగ్ర అభివృద్ధికి ప్రత్యేక చర్యలు తీసుకోవాలని విద్యా శాఖ జాయింట్ డైరెక్టర్ మువ్వా రామలింగం, ఏపీజీటీఏ రాష్ట్ర అధ్యక్షుడు బి.తిరుపాల్ ఉపాధ్యాయులకు సూచించారు. జెడ్పీ సమావేశ మందిరంలో రాష్ట్ర ప్రభుత్వ ఉపాధ్యాయ సంఘం ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించిన విద్యా సదస్సులో అధికారులు మాట్లాడారు. ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేయాలన్నారు. విద్యార్థుల డ్రాపౌట్స్ లేకుండా చర్యలు చేపట్టాలన్నారు. విద్యార్థుల్లో నైపుణ్యాలను పెంపొందించాలని తెలిపారు. అనంతరం జీటీఏ నాయకులు మాట్లాడుతూ ఉపాధ్యాయుల సమస్యలపై ప్రత్యేక దృష్టి సారిస్తామని తెలిపారు. ఉపవిద్యాశాఖాధికారులు హరిప్రసాద్, జానకీరామ్, నాయక్, నరసింహారావు పాల్గొని, పలు సూచనలు చేశారు. అనంతరం ఉద్యోగ విరమణ చేసిన హెచ్‌ఎంలు, ఎంఈఓలు, ఉపాధ్యాయులను సన్మానించారు.

ఆదాలపై విమర్శలు సిగ్గుచేటు

నెల్లూరు(బృందావనం): మాజీ ఎంపీ, వైఎస్సార్‌సీపీ నేత ఆదాల ప్రభాకర్‌రెడ్డిపై వెంకటస్వామి చేసిన విమర్శలు సిగ్గుచేటు అని ముస్లిం యూత్ సేవా అధ్యక్షుడు ఖాలీద్ అన్నారు. స్థానిక జెండావీధిలోని మసీద్ వద్ద ఆదివారం ఆయన విలేకరుల సమావేశం నిర్వహించారు. గత కొన్ని సంవత్సరాలుగా ఆదాల వద్ద ఎంతో లబ్ధి పొందిన వెంకటస్వామి వాటిని మరిచి విమర్శలు, ఆరోపణలు చేయడం తగదన్నారు. ఆదాల ఎందరో పేదలకు సాయం చేశారని, అనేక సేవా కార్యక్రమాలు చేపట్టారన్నారు. అలాంటి వ్యక్తిపై విమర్శలు చేయడం సిగ్గుచేటు అని, వెంకటస్వామి బహిరంగ క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. సమావేశంలో ముస్లిం యూత్ సేవా సభ్యులు ఉమర్, ఖాలీద్, మీరా, అల్తాఫ్ తదితరులు పాల్గొన్నారు.

బైక్ చోరీ

నెల్లూరు సిటీ: నారాయణ హాస్పిటల్ గేటు బయట నిలిపిన బైక్‌ను గుర్తుతెలియని వ్యక్తులు చోరీ చేశారని బాధితుడు ఆదివారం రూరల్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసుల వివరాల మేరకు.. గూడూరు పట్టణానికి చెందిన అక్బర్‌బాషా ఈనెల 11న నారాయణ హాస్పిటల్‌లో మెడికల్ చెకప్‌కు వచ్చారు. బైక్‌ను ఆస్పత్రి గేటు బయట పార్కింగ్ చేసి చెకప్ చేయించుకుని బయటకు వచ్చి చూడగా కనిపించలేదు. దీంతో సమీప ప్రాంతాల్లో వెతికినా లాభం లేకపోవడంతో రూరల్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

దాడులను ఆపాలి



నెల్లూరు(వీఆర్సీసెంటర్): రాష్ట్రంలో రోడ్డు మార్జిన్ వ్యాపారస్తులపై దాడులు జరుగుతున్నాయని, వాటిని వెంటనే ఆపాలని సీఐటీయూ రాష్ట్ర నాయకురాలు విజయలక్ష్మి అన్నారు. బాలాజీ నగర్‌లోని రామచంద్రారెడ్డి భవన్‌లో జిల్లా రోడ్డు మార్జిన్ వ్యాపారస్తుల మొదటి మహాసభను ఆదివారం నిర్వహించారు. రాష్ట్ర ప్రభుత్వం రోడ్డు మార్జిన్ వ్యాపారస్తుల సంక్షేమం కోసం చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. అనంతరం 18 మందితో నూతన కమిటీని ఎన్నుకున్నారు. అధ్యక్ష, కార్యదర్శులుగా వెంకటేశ్వర్లు, మోహన్ ఎన్నికయ్యారు. సీఐటీయూ జిల్లా కార్యదర్శి అజయ్‌కుమార్, నగర కార్యదర్శి నాగేశ్వరరావు, సుధాకర్ పాల్గొన్నారు.